9న ఉగాది కవి సమ్మేళనం

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ రచయితల వేదిక, డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రోధినామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు సంస్థల అధ్యక్షులు నేరెళ్ల హనుమంతు, డాక్టర్ అప్పాల చక్రధారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌లో ఉన్న లయన్స్ క్లబ్ ప్రాంగణంలో ఉగాది వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కవితా గానం చేసే వారు తమపేర్లను ముందుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎంపికైన కవితలు జిల్లా సంకలనం కోసం ఎంపిక చేయబడతాయన్నారు.

రంజాన్ వేళలు

ఆది
ఇఫ్తార్
6:33

సోమ
సహర్
4:42

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.6 /26.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చిన్నారులకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఆనంది

నిర్మల్‌టౌన్: మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో భారతదేశ గౌరవ పురస్కారాలు–2024 కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన కూచిపూడి డ్యాన్స్ మాస్టర్ నవ్య ఆధ్వర్యంలో 20 మంది చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. చిన్నారులను కార్యక్రమ నిర్వాహకులు భారతదేశ గౌరవ పురస్కారాలు, ప్రశంస పత్రాలు అందించి అభినందించారు.

'కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మర్చిపోయింది'


రైతు దీక్షలో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మర్చిపోయిందని జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ రైతు దీక్ష కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత పదేళ్లలో రైతులకు కష్టాలు రాలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కష్టాలు వచ్చి పడ్డాయని ధ్వజమెత్తారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని, యాసంగి నుంచి రూ.500 బోనస్ ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, పాకాల రాంచందర్, డాక్టర్ సుభాష్ రావు, నరహరి, రాజేశ్వర్, శివ, బిట్టు, హరీశ్, నవీన్, రాజు పాల్గొన్నారు.

భైంసాటౌన్: రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్లమెంట్ సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ పి.రమాదేవి, విలాస్ గాదేవార్, డా కిరణ్ కొమ్రేవార్ ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు.

బాల రచయితలూ.. భళా!

సండే స్పెషల్

గతంలో నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు కథలు చెబుతుంటే ఒళ్లో కూర్చొని వింటూ ఆ కథలోనే లీనమయ్యేవాళ్లం. సాయంత్రం ఆరుబయట, దాబాపైన ఇలా వారు కథలు చెబుతుంటే వింటూ అలా నిద్రపోయేవాళ్లం. ఆ కథల్లో నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, దైవిక చింతన, గ్రామీణ నేపథ్యం వంటి వృత్తాంతాలు ఇమిడిఉండేవి. రామాయణం నుంచి మొదలుకొని ఎన్నో నీతి, సాహస కథలు చెబుతుంటే చిన్నపిల్లలు ఊహల ప్రపంచంలో విహరించేవారు. కానీ నేడు ఆ పరిస్థితులు మారాయి. ఉమ్మడి కుటుంబాలు కాస్త విచ్ఛిన్నమయ్యాయి. దీనికి తోడు పాఠశాల చదువులు, సిలబస్, పరీక్షల ఒత్తిడి, చేతుల్లో చరవాణులపై వేళ్లను ఆడించేందుకే సరిపోతున్నారు. నైతిక విలువలు కనుమరుగవుతున్న ఈ తరుణంలో 15 ఏళ్లలోపు ప్రభుత్వ పాఠశాల చిన్నారులు ఉపయుక్తంగా ఉండే కథలను వారే స్వయంగా రాసి మానవీయ విలువలను పెంపొందించే ప్రయత్నం చేశారు. ఇదే అంశంపై సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.


ఉపాధ్యాయ బృందంతో కథా రచయితలు(ఫైల్)

- కథారచనలో పదోతరగతి విద్యార్థినులు
- నైతిక, సాహిత్య విలువల సాధనలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం
- సర్కారుబడి విద్యార్థుల కథల సంపుటి విడుదల
- జిల్లాలో సర్వత్రా ప్రశంసల వర్షం

నిర్మల్‌ఖిల్లా: చదువులతల్లి సరస్వతీదేవి కొలువై ఉన్న నిర్మల్ జిల్లాలో ఆడిపాడే వయస్సులో అద్భుతమైన కథలు రాసి ప్రముఖుల ప్రశంసలు అందుకుంటూ ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతున్నారు. సోన్ మండలంలోని వెల్మల్ బొప్పారంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు 19 మంది కలిసి దాదాపు 20 కథలను సొంతంగా రచించారు. తెలుగు ఉపాధ్యాయుడు కొండూరి పోతన్న, ప్రధానోపాధ్యాయులు నాలం విద్యాసాగర్, ఉపాధ్యాయబృందం ప్రోత్సాహం అందించారు. గ్రామీణ పరిస్థితుల నేపథ్యం, కుటుంబ విలువలు, వ్యక్తిగత, వృత్తి గత అంశాలు, దైనందిన సందర్భాలను ఇతివృత్తాలుగా తీసుకుని అద్భుతమైన కథలుగా మలిచారు.

కథల్లో లోతెంతో...

విద్యార్థులు తమ చుట్టూ గమనించి, గ్రహించిన అంశాలను కథలుగా మలిచారు. ఇవన్నీ హృదయానికి హత్తుకునేవిధంగా ఉన్నాయి. ఇందులో నీతితో పాటు నిరుపేద, దిగువ మధ్యతరగతి కుటుంబీకుల జీవనవిధానం ప్రతిబింబించేలా ఉన్నాయి. పాఠశాలకు చెందిన దాదాపు 19 మంది విద్యార్థినులు 20 కథలు రాయగా 'వెల్మల్ బొప్పారం విద్యార్థుల కథల సంపుటి'గా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా గతవారం వెలువరించారు.



విద్యార్థులు రచించిన కథల సంపుటి ముఖచిత్రం

'స్నేహబంధం' కథలో శివరాత్రి మహేశ్వరి స్నేహం గొప్పతనాన్ని అద్భుతంగా మలిచింది. 'ఆడదాని జీవితం' కథని దాసరి రనిత రెడ్డి.. మగవారి వేధింపులు భరింపలేని సందర్భంలో గ్రామ పెద్దలు అండగా నిలబడగా తాను కష్టాలను అధిగమించిన తీరు ఆకట్టుకుంటుంది. ఇక 'ఆడపిల్లలంటే అలుసా' అనే కథలో తారా రక్షిత.. ఆడపిల్లలు తమ కాళ్ళపై తాము స్వశక్తితో నిలబడి నిలబడిన తీరు గురించి రాసిన కథ ఆలోచింపజేస్తోంది. 'అమ్మానాన్నలు చెప్పినట్టు వినాలి' అనే కథలో తన కూతురు కోసం తండ్రి కిడ్నీని అమ్మి కూతురుని పెంచిన విధానాన్ని సిరిగాపురం వర్ధిని చక్కగా వివరించి రాసింది. 'నిజాయతీ' అనే కథలో తాను చేసిన తప్పుకు తన స్నేహితురాలు బలవుతోందని బాధపడి తాను చేసిన తప్పును ఒప్పుకున్న తీరు పాఠకులను ఆకర్షించే విధంగా రాజశ్రీ రాసింది. 'తాగుబోతు తండ్రి..లక్షణమైన కూతురు' అనే కథలో కూతురు పుట్టిందని తండ్రి పిల్లలను, తల్లిని ఇంటి నుంచి వెళ్లగొట్టడం అదే పిల్లలు కష్టపడి చదివి ప్రయోజకులు అవ్వడంతో తండ్రి పశ్చాత్తాప పడిన తీరు మనసును ఆకట్టుకునే విధంగా అంజన మలిచింది. కథలన్నీ మానవత్వం, కుటుంబ విలువలు, సంబంధాలు బలపరుచుకోవాలన్న తీరును అద్భుతంగా వివరిస్తున్నాయి.

విద్యార్థినులు రాసిన కథలు ఇవే...

కథ	: రచయిత
స్నేహబంధం	: శివరాత్రి మహేశ్వరి
ఆడదాని జీవితం	: దాసరి రనితారెడ్డి
ఆడపిల్లలంటే అలుసా	: తారా రక్షిత
అమ్మానాన్న చెప్పినమాట వినాలి	: సిరిగాపురం వర్ధిని
నిజాయతీ	: జొర్రిగ రాజశ్రీ
చెప్పుడు మాటలు వినవద్దు	: మద్దెర్ల గీతిక
పట్టుదల	: మద్దెర్ల గీతిక
తాగుబోతు తండ్రి, లక్షణమైన కూతురు	: ఓజ అంజన
చిరుస్నేహం	: గరిగంటి అంజలి
కాకి అందం	: భరత్ శైలజ
అమ్మ ప్రేమ	: రాచర్ల రాగిణి
తండ్రి ప్రేమ	: మండాజి అంజన
చెడుమాటలు వినవద్దు	: ముడపెల్లి అఖిల
అన్నదమ్ముల ప్రేమ	: బద్దం కీర్తన రెడ్డి
తండ్రి ప్రేమ	: ఎస్‌కే ఫర్హీన్
చివరి కోరిక	: గుర్రం వర్షిణి
నిజమైన స్నేహితుడు	: గుమ్ముల నందిని
అరుణాచల యాత్ర	: మోర రచన
చిలుక తెలివి	: బల్లెపు లక్ష్మిప్రసన్న
స్నేహం విలువ	: సిరిగిరి భూమిక

సాహిత్యంతోనే జీవన గమనం..


బాల్యం నుండి ఏ సమాజంలోనైతే సాంస్కృతిక, సాహిత్య వికాసం పాదుకుంటుందో ఆ సమాజం ఆదర్శంతమైన నాగరికుల్ని తయారు చేస్తుంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అందించిన 20 కథలతో కూడిన ఈ కథల సంపుటి ఎంతో మందికి ఆదర్శం. ఏ విలువల పునాదులైనా పాఠశాల స్థాయి నుంచే అంటే బాల్యం నుంచే పడాలి. పాఠశాల స్థాయి విద్యార్థులు సామాజిక స్పృహతో కూడిన అంశాలను పాఠకుల కళ్ళకు కట్టేలా ఇందులోని కథలు ఉన్నాయి. కథల సంపుటిలోని విద్యార్థులు రాసిన కథలు చదువుతుంటే మనసుకు హత్తుకునే విధంగా ఉన్నాయి.
– ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

మానవ సంబంధాలే ప్రధానాంశంగా..


కుటుంబం విలువలు ఇరుగు పొరుగు వారితో మానవ సంబంధాలు కలిగి ఉండడంపై సంఘటితంగా ఉండవచ్చు. ఐక్యంగా ఉంటూ సమాజ జీవనం గడపడంలో పొందే అనుభూతే వేరుగా ఉంటుంది. ఇవే ప్రధానాంశాలుగా కథను రాశా. మనసులో అనుకున్న అంశాన్ని పేపర్ పై కథగా తయారు చేశాం. వీటిని క్రమ పద్ధతిలో పేర్చి పుస్తక రూపంలో తీసుకురావడం మాకు చాలా సంతోషంగా ఉంది. – ఓజ అంజన, కథా రచయిత్రి

ఆలోచింపదగినవిగా ఉన్నాయి


మా పాఠశాల విద్యార్థులు కథలు రాసి, వాటిని సంపుటిగా వెలువరించడం ఆనందంగా ఉంది. విద్యార్థుల ప్రస్థానం వెనుక మా పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం చాలా ఉంది. ముున్ముందు సాహితీ క్షేత్రంలో వీరి మరిన్ని రచనలు వెలుగులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాం. వీరి స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులు ప్రేరణ పొందుతారు.
– నాలం విద్యాసాగర్, హెచ్ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల, వెల్మల్ బొప్పారం

అమ్మ ప్రేమపై కథ రాశా...


అమ్మ ప్రేమ అనే అంశంపై నేను కథ రాశా. ఇందులో అమ్మ ప్రేమ అనేది మనుషులకే కాదు.. జంతువులకు సైతం ఒకే రీతిలో ఉంటుందని ప్రధాన అంశాన్ని తీసుకున్నా. అన్ని ప్రాణులలో కూడా అమ్మ ప్రేమను మించిన ప్రేమ లోకంలో ఏదీ ఉండదనే నీతిని ఇందులో తెలియజెప్పా.
– రాచర్ల రాగిణి, పదో తరగతి

చెప్పుడు మాటలు విని చెడిపోవద్దంటూ..


మనం చేసే పనిలో అందరి సలహాలు స్వీకరిస్తూ అంతిమ నిర్ణయం మాత్రం మనమే తీసుకోవాలనే ప్రధాన ఇతివృత్తంగా 'చెడు మాటలు వినవద్దు' అనే కథను రాశాను. ఈ కథల సంపుటిలో నన్ను భాగస్వామ్యం చేసినందుకు పాఠశాల ఉపాధ్యాయ బృందానికి, పోతన్న సార్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. – ముడపెల్లి అఖిల, బాల రచయిత్రి

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే...


మా తెలుగు ఉపాధ్యాయుడు పోతన్న, ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, మిగతా ఉపాధ్యాయ బృందం ప్రోత్సాహంతోనే కథలు రాశాం. వాటిని అందంగా పుస్తక రూపంలో ప్రచురింపజేసినందుకు ధన్యవాదాలు. మా ఇంటి చుట్టుపక్కల, మా ఊర్లో గమనించిన సన్నివేశాలను ఆధారంగా చేసుకుని కథలు రాశాం. నేను ఆడదాని జీవితం అనే కథ రాశా. ఇందులో ఆడది అంటే ఆటబొమ్మకాదు అనే నీతి దాగి ఉంటుంది.
– దాసరి రనితారెడ్డి, కథా రచయిత్రి, పదోతరగతి

ప్రేరణ కల్పించాం


విద్యార్థుల్లో అంతర్గతంగా నిబిడీకృతమై ఉన్న కాల్పానిక, రచనాశక్తిని బహిర్గతపరిచేలా ప్రేరణ కల్పించాం. దీంతో తమ నిత్య జీవితంలో పరిశీలించిన అంశాలను కథలుగా మలిచారు. కథాంశాలన్నీ విద్యార్థిని సృజనాత్మకతను సానపెట్టే విధంగా ఉన్నాయి. అనంతరం వాటిని పుస్తకంగా ప్రచురింప చేయడం, ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా విడుదల చేయడం మా అందరికీ గర్వకారణంగా ఉంది. – కొండూరి పోతన్న, తెలుగు ఉపాధ్యాయుడు

చామన్‌పెల్లికి జ్వరమొచ్చింది


ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు బొమ్మెన జ్యోతి. మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన ఆమెకు రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుంది. రక్త కణాలు తగ్గాయని, డెంగీ పాజిటివ్ వచ్చిందని వైద్యులు చెప్పడంతో అక్కడే ఉండి చికిత్స పొందుతోంది.


ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు సుంకరి శ్రీనివాస్. చామన్‌పెల్లి గ్రామానికి చెందిన ఇతనికి జ్వరం రావడంతో శుక్రవారం నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్నాడు. డెంగీ వచ్చిందని చెప్పడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఈ ఇద్దరు మాత్రమే కాదు. గ్రామంలో పదుల సంఖ్యలో పలువురిది ఇదే పరిస్థితి. శనివారం ఒక్కరోజే ఐదుగురు వ్యక్తులు జ్వరంతో బాధపడుతూ నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారని గ్రామస్తులు చెబుతున్నారు.


ఎస్సీ కాలనీలో ఇంటి పక్కనే నిల్వ ఉన్న మురికి నీరు

- 20 రోజుల వ్యవధిలో 40 మందికి డెంగీ
- గ్రామంలో లోపించిన పారిశుధ్యం

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో ప్రతీ ఇంటా ఒకరిద్దరు జ్వరంతో బాధపడతున్నారు. 20 రోజుల వ్యవధిలో 30 నుంచి 40 మంది డెంగీ భారిన పడ్డారని గ్రామస్తులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరంతో చేరిన వారిలో ఎక్కువ మంది చామన్‌పెల్లి వాసులే కావడం విశేషం. ఇందులో 30 మంది వరకు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి ఆరోగ్యం మెరుగు కావడంతో ఇంటికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన కొమ్మోజి లక్ష్మికి రక్తకణాలు తగ్గడంతో మృతి చెందింది. ప్రస్తుతం గ్రామానికి చెందిన 10 మంది వరకు డెంగీతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు వారు పేర్కొన్నారు. జ్వరంతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఎక్కువ మందికి రక్తకణాలు తగ్గినట్లు వైద్యపరీక్షల్లో తేలింది. ఒకేసారి అంతా జ్వరాల భారిన పడడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. దీంతో ఇంటికి రూ.వెయ్యి చొప్పున పోగుచేసి పెద్దపండుగ కూడా జరిపించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

అపరిశుభ్ర వాతావరణంతో...

గ్రామంలోని ఎస్సీకాలనీ, రెడ్డికాలనీల్లో డ్రెయినేజీల నిర్మాణం లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చిన మురుగునీరు నిల్వ ఉండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఆ నీటిలో దోమలు ఆవాసం ఏర్పర్చుకోవడంతో జ్వరాలు సోకుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి డెంగీ ప్రబలకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బీసీ కాలనీలో రోడ్డు పక్కనే మురుగునీరు

వైద్యశిబిరం

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. 472 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 42 మంది రక్త నమూనాలు సేకరించినట్లు వైద్యురాలు తెలిపారు. జ్వరంతో ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు.

పదిరోజులు ఆస్పత్రిలోనే ఉన్నా..


మాది చామన్‌పల్లి గ్రామం. ఇటీవల జ్వరం రావడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరా. పది రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. రూ.45 వేల వరకు ఖర్చు అయ్యింది. మా ఇంటి వద్ద మురుగు కాలువలు లేకపోవడంతో నీరు నిల్వ ఉండి దోమలు పెరుగుతున్నాయి.
– పల్లికొండ సరస్వతి, చామన్‌పెల్లి

డ్రెయినేజీలు నిర్మించాలి


మా ఇంటి సమీపంలో డ్రెయినేజీలు నిర్మించలేదు. దీంతో ఇళ్ల నుంచి వచ్చిన మురుగునీరు రోడ్ల పక్కనే నిల్వ ఉంటోంది. దోమలు పెరగడంతో జ్వరాలు సోకుతున్నాయి. నాకు జ్వరం రావడంతో ఐదురోజులు ఆస్పత్రిలోనే ఉండి చికిత్స చేయించుకున్నా. డ్రెయినేజీలు నిర్మించి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. – ఏలేటి అరుణ్‌రెడ్డి, చామన్‌పెల్లి

తగిన చర్యలు చేపడుతాం

మల్లాపూర్ సబ్‌సెంటర్ ఆధ్వర్యంలో పల్లె దవాఖానా వైద్యులచేత ఇదివరకే చామన్‌పెల్లిలో వైద్యశిబిరం నిర్వహించాం. గ్రామంలో సర్వే చేయించాం. జ్వరంతో ఉన్న వారి రక్త నమూనాలు సేకరించి మందులు అందించాం. మళ్లీ వైద్యశిబిరం నిర్వహించి గ్రామంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతాం.
– ప్రత్యూష, పీహెచ్‌సీ వైద్యురాలు, లక్ష్మణచాంద

డీ1 పట్టాల పేరుతో భూములు మాయం

- బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: గత పాలకులు జిల్లాలోనూ డీ1 పట్టాల పేరుతో భూములు మాయం చేశారని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధరణి పేరుతో రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూమి మాయమైందన్నారు. రికార్డులను సైతం మార్చి దొంగ పట్టాలు పంపిణీ చేశారన్నారు. పట్టణంలోని డీమార్ట్ ప్రాంతం (4 ఎకరాల 29 గుంటలు) ప్రభుత్వ భూమి అని ఆధారాలతో సహా అధికారులకు ఇచ్చామన్నారు. మంత్రులు ఆదేశాలిచ్చినా అధికారులు వ్యాపారులకు మేలు చేస్తున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు 412 హామీలు నెరవేర్చిన తర్వాతే పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టో ప్రవేశపెట్టాలన్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని, ఆతర్వాతే తుక్కుగూడలో కొత్త మేనిఫెస్టో ప్రకటించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మె రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే అభివృద్ధి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీహయాంలోనే దేశం అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్ రెడ్డి అన్నారు. బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో నాయకుల త్యాగాల ఫలితంగా బీజేపీ అతిపెద్ద పార్టీగా ఉద్భవించి నేడు ప్రపంచానికే మార్గదర్శనం చేసే స్థాయికి వెళ్లిందన్నారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి నగేష్‌ను గెలిపించి నరేంద్ర మోదీకి కానుకగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అయ్యన్న గారి రాజేందర్, తోట సత్యనారాయణ, భూపతిరెడ్డి, అల్లం భాస్కర్, రావుల రాము, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో...

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం బూత్ లెవల్ కార్యకర్తలతో టిఫిన్ బైటక్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాయుడువాడలో...

బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్ ఆధ్వర్యంలో నాయుడివాడ (వార్డ్ నంబర్–2, బూత్ నంబర్ 211, 212, 213) లోని శివాజీ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం టిఫిన్ బైటక్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు పాలాస భరత్ కుమార్, ఉపాధ్యక్షుడు ఏపూరి ప్రమోద్, నాయకులు తాడిచెట్ల దివాకర్, దుబ్బ ప్రవీణ్, సత్యేందర్, సంపత్, సట్ల రాకేష్, నాయుడి భరత్, అన్వేష్, కిరణ్, శేఖర్, ప్రశాంత్, వినయ్, రిషి, సజిత్, వినోద్, నవీన్, విజయ్, మని, బూత్ సభ్యులు పాల్గొన్నారు.


పార్టీ జెండా ఎగురవేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

బీజేపీ హయాంలోనే దేశం పురోగతి

భైంసాటౌన్: బీజేపీ ప్రభుత్వ హయాంలోనే దేశం అన్నిరంగాల్లో పురోగతి సాధించిందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి టిఫిన్ బైఠక్‌లో పాల్గొని అల్పాహారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, బాలాజీ పటేల్, బాలాజీ సూత్రావే, గాలి రవి, తూమోల్ల దత్తాత్రి, వేణుగోపాల్, కోర్వ శ్రీకాంత్, వెంకట్రావు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషిచేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, చేపట్టనున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 672 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో మహిళా సమాఖ్య అధ్యక్షులు, పట్టణాల్లో పట్టణ సమాఖ్య అధ్యక్షులు చైర్మన్‌గా ఉంటారన్నారు. ప్రతీ కమిటీ పేరు మీద బ్యాంక్ ఖాతా తెరవాలని సూచించారు. బడీడు పిల్లలందర్నీ బడిలో చేర్పించడం, అవసరమైన వసతుల కల్పనకు ప్రణాళికలు తయారు చేయ డం, రోజువారీ హాజరు సమీక్ష, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, ఆర్థిక వనరులను సక్రమంగా వినియోగించేలా చూడ డం వంటి పనులపై దృష్టి సారించాలన్నారు. పనుల ప్రారంభానికి ముందు, తర్వాత నివేదికలతో పాటు ఫొటోలను సమర్పించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఏఎల్ఎఫ్, ఎస్‌హెచ్‌జీ స భ్యులను భాగస్వాములను చేసి గుణాత్మక విద్య లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో ర వీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, సీపీవో బాబురావ్, జెడ్పీసీఈవో గోవింద్, ఇంజనీరింగ్ శాఖల అధి కారులు అశోక్ కుమార్, శంకరయ్య, సంతోష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సీఎంఆర్ సరఫరా వేగవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10లోగా పూర్తి చేయాలని సూచించారు. నిబంధనలు పాటించని మిల్లర్లకు చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఎస్‌వో నందిత, సివిల్‌సప్లయ్ డీఎం పాల్గొన్నారు.

భక్తిమార్గంలో యువత


సంత్ సేవాలాల్ మహరాజ్


అనార్‌పల్లి పూజల్లో పాల్గొన్న భక్తులు

సండే స్పెషల్

ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తండాలు భక్తి భావంలో పరిడవిల్లుతున్నాయి. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ఆలయాల్లో ప్రత్యేక పూజలతో బంజార సోదరులు తరించిపోతున్నారు. సేవాలాల్ దీక్ష భూమిని భక్తులు నియమనిష్టలు పాటిస్తూ తరించిపోతున్నారు. ముఖ్యంగా యువత ఈసారి అత్యధిక మంది దీక్షను చేపట్టారు. నాడు ప్రేమ్‌సింగ్ మహరాజ్ చేపట్టిన దీక్ష నేడు ప్రతీ తండాల్లో విస్తరించింది. కొద్దిరోజులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నిర్ణయించిన భక్తులు సేవాలాల్ దీక్షను చేపట్టారు. శ్రీరామ నవమిన మహరాష్ట్రలోని పోహరాదేవిలో దీక్ష విరమించనున్నారు. దీనిపై సాక్షి ప్రత్యేక కథనం..

- తండాల్లో పెరుగుతున్న భక్తిభావం
- సేవాలాల్ నామస్మరణలో గ్రామాలు
- 756 తండాల్లో 31వేల మంది సేవాలాల్ భక్తులు
- దీక్షలపై ఆసక్తి చూపుతున్న యువత
- నానాటికీ పెరుగుతున్న భక్తి భావం
- శ్రీరామ నవమితో ముగింపు


జగదంబాదేవికి పూజలు చేస్తున్న పుజారి

కెరమెరి(ఆసిఫాబాద్): కొద్దిరోజులైన చాలు భక్తి భావంతో మెలుగుతూ.. కులగురు అయిన సేవాలాల్ మహరాజ్ లీలా గానంలో లీనమైపోవాలన్న లంబాడ(బంజార) ప్రజలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. కఠోర దీక్ష.. కఠిన నియమాలు అవలంభిస్తున్నారు. 1979లో మహతపస్వీ, దీక్ష గురువైన ప్రేంసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో 1600 మందితో నార్నూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రారంభమైన ఈ దీక్ష 45 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ప్రతీ సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మహశివరాత్రి నుంచి ప్రారంభమై శ్రీరామనవమి వరకు ఈ దీక్షలు కొనసాగుతాయి. మరో పది రోజుల్లో దీక్షలు ముగియనున్నాయి. 11, 21, 41 రోజులు దీక్షా కాలంగా స్వీకరించవచ్చు. ఆడ, మగ, చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఈ దీక్షలు స్వీకరించారు.

31వేల మంది సేవాలాల్ భక్తులు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లోని 756 తండాల్లో సుమారు 31వేల మంది సేవాలాల్ భక్తులు ఉన్నారు. ఇందులో యువకులే అధికం. సుమారు 20వేల మంది యువకులు (18-40) ఈ ఏడాది దీక్షలు స్వీకరించినట్లు తెలుస్తోంది. ఇందులో మధ్యవయస్కులు, వృద్ధులు సుమారు 6వేలు, మహిళలు, చిన్నారులు 5వేల మంది దీక్షలు స్వీకరించారు. అయితే అధికంగా 11 రోజుల దీక్షను స్వీకరించారు. చెప్పులు లేకుండా నడవాలనేది దీక్షలో నియమం. దీక్షాపరులు కేవలం రోజుకు ఒకపూట భోజనమే చేస్తారు. పండ్లు, ఫలహారాలు తీసుకోవచ్చు.

శ్రీరామ నవమికి దీక్షా విరమణ..

మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లాలోని పోహరాదేవి గ్రామంలో కొలువైన జగదంబాదేవి సమక్షంలో దీక్ష విరమణ చేస్తారు. శ్రీరామనవమి రోజున జిల్లాలోని సేవాలాల్ భక్తులు అందరు పోహరాదేవికి బయలుదేరి వెళ్తారు. అక్కడే దీక్షలు విరమిస్తారు. దీక్షలు విరమించే మరో చోటు ఎక్కడా లేదు. దీక్షా స్వీకరించిన ప్రతి భక్తుడు పోరాదేవి వద్దకు వెళ్లాల్సిందే.

25ఏళ్లుగా దీక్ష స్వీకరణ



నేను 25ఏళ్లుగా సేవాలాల్ దీక్ష స్వీకరిస్తున్నాను. దీక్షా తీసుకున్నప్పటి నుంచి అంతా మంచే జరుగుతుంది. ప్రతి సంవత్సరం 41 రోజులు దీక్షలోనే ఉంటాను. కష్టాల్లో ఉన్న నేను నా కుటుంబం ప్రస్తుతం హాయిగా జీవిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు తొలిగిపోతున్నాయి. – సున్నాబాయి, కెరమెరి

మనస్సుకు ప్రశాంతత



27ఏళుగా సేవాలాల్ దీక్ష స్వీకరిస్తున్నాను. యువతలో భక్తి భావం ఎక్కువ కనిపిస్తుంది. దేవుడిని పూజిస్తే అంతా మంచి జరుగుతుంది. దీక్షలో చక్కటి లక్షణాలు అవడతాయి. ప్రతి ఒక్కరు దీక్ష చేపడితే కొద్ది రోజులైనా మంచి అలవాట్లు అలవడుతాయి.

–జాదవ్ వస్రాం, అనార్‌పల్లి, పుజారి

కోరికలు నెరవేరాయి



నేను ఈ సంవత్సరం ప్రథమ సారిగా దీక్ష స్వీకరించాను. గతంలో నా తండ్రి దీక్ష చేసేవారు. అప్పుడే నా మనసులోని కోరికలు నెరవేరితే దీక్ష స్వీకరిస్తానని సేవాలాల్‌ను కోరారు. నా ఆశయం నెరవేరింది. ఉద్యోగంలో చేరాను. కొద్ది రోజులైనా నియమనిష్టలతో ఉండాలని నిశ్చయించుకున్నాను.

– అజ్మీర పవన్, రెబ్బెన

క్లుప్తంగా

ఎంపీ సోయం బాపూరావు వాహనం తనిఖీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండల కేంద్రలోని ఆదిలాబాద్ బైపాస్ వద్ద శనివారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు వాహనాన్ని ఎన్నికల స్కాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఆదిలాబాద్ ఎంపీ ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో ఆదిలాబాద్ బైపాస్ వద్ద ఎన్నికల బృందం తనిఖీ బృందం క్షుణంగా తనిఖీ చేయగా ఎంపీ వాహనంలో నుంచి కిందికి దిగి అధికారులకు సహకరించారు.

తాటిచెట్లు తొలగించడంపై ఫిర్యాదు


పరిశీలిస్తున్న అధికారులు

మామడ: దిమ్మదుర్తి గ్రామం సమీపంలోని తాటిచెట్లను విద్యుత్ సిబ్బంది తొలగించారని వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎక్సైజ్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలంను అధికారులు సందర్శించి వివరాలు నమోదు చేశారు. విద్యుత్‌వైరుల కింద ఎండిన తాటిచెట్లు ఉండటంతో విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలగరాదనే ఉద్దేశంతో తాటిచెట్లు తొలగించామని విద్యుత్ శాఖ ఏఈ బాలయ్య పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం


ముత్తవ్వ

సారంగపూర్: భైంసా మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన సిరిమన్ ముత్తవ్వ(27) మండలంలోని అడెల్లి ఆలయం వద్ద శనివారం అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తవ్వ మతిస్థిమితం కోల్పోయి గతంలో ఇలాగే ఓసారి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె దొరకాలని, తన ఆరోగ్యం మెరుగుపడాలని అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటానని మొక్కుకుంది. శుక్రవారం అడెల్లి ఆలయానికి రాగా ముత్తవ్వ, ఆమె తల్లి ఆలయంలో పూజలు చేసే క్రమంలో కనిపించలేదు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిస్తే 87126 59516కు ఫోన్ చేసి తెలపాలని ఎస్సై పేర్కొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్


బైండోవర్ చేస్తున్న పోలీసు సిబ్బంది

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన పలువురు పాత నేరస్తులను శనివారం తహసీల్దార్ సుజాత ఎదుట బైండోవర్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నారయణ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి పేర్కొన్నారు.

మొక్కజొన్న పంట క్షేత్ర పరిశీలన


పంట క్షేత్ర పరిశీలనలో శాస్త్రవేత్తలు

ఎదులాపురం: వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో రూపొందించిన కేఎస్ఎంహెచ్–4191 మొక్కజొన్న పంట క్షేత్రాలను, హైబ్రిడ్ చిరు సంచుల క్షేత్రాలను ఆ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మంజులత, శ్రావణి, ఉషలు శనివారం కేవీకే శాస్త్రవేత్తలతో కలిసి సందర్శించి పరిశీలించారు. మొక్క చిరు సంచి ప్రస్తుతం కంకి దశలో ఉందని, కత్తెర పురుగు ఉధృతి తక్కువగా ఉండి తెగుళ్ల బెడద లేదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రైవేటు హైబ్రిడ్‌లకు దీటుగా ఉండి 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. మన్నూర్ (గుడిహత్నూర్) , పార్డి(బి) (జైనథ్), సిర్సన్న (బేల) గ్రామాల్లో చిరు సంచులను అందించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. వారితో పాటు కేవీకే శాస్త్రవేత్తలు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, రైతులు ఉన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


టిఫిన్ చేస్తున్న నగేశ్


జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ అభ్యర్థి నగేశ్

బజార్‌హత్నూర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని జాతర్ల గ్రామంలో శనివారం బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్ జెండా ఆవిష్కరించారు. అలాగే ఎంపీ అభ్యర్థి ఆధ్వర్యంలో టిఫిన్ బైటక్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయిసెంటర్ భవనంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేస్తూ లోకసభ ఎన్నికల్లో పార్టీ విజయంపై చర్చించారు. బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా కష్టపడి ఆదిలాబాద్ గడ్డ మీద బీజేపీ జెండా ఎగురవేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, వైస్‌ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, నాగోరావ్, మండల అధ్యక్షులు బత్తిని సుధాకర్, బలిరాం, కేవల్‌సింగ్, సంతోష్, రాజేశ్వర్, నానం రమణ, అల్కే గణేష్, ఉత్తం, సుఖ్‌దేవ్, జయవంత్‌రావ్, నానక్‌సింగ్, రమేష్, జాంసింగ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం

భైంసాటౌన్: పట్టణంలోని గోశాల సమీపంలో శనివారం ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మడుగుల సాయినాథ్ అనే రైతు పశుగ్రాసం కొనుగోలు చేసి నిల్వ ఉంచగా, మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో సమాచారమందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే చేరుకుని మంటలార్పివేశారు. అప్పటికే పూర్తిగా దగ్ధం కాగా, రూ.5లక్షల వరకు నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపారు.

సాజీద్‌ఖాన్‌పై కేసు నమోదు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు సాజీద్‌ఖాన్‌పై శనివారం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి అనుమతి లేకుండా పట్టణంలో దావత్ ఏ ఇఫ్తారు విందు ప్లెక్సీలను ఏర్పాటు చేశారని పేర్కొంటూ ఎఫ్‌ఎస్‌టీ అధికారి మంజుల సంతోష్ టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా కోడ్ ఉల్లంగించిన సాజీద్ ఖాన్‌పై 188 ఐపీసీ, 127 ఆర్‌పీ యాక్ట్ ప్రకారంగా కేసు నమోదు చేసినట్లుగా సీఐ అశోక్ తెలిపారు.

ఇద్దరిపై..

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలు గత మంగళవారం రాత్రి ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వారిని నిర్మల్ ఏరియా ఆస్పత్రిలో, స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. విద్యార్థినిల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అనారోగ్యానికి కారణమైన ఎస్‌వో చింతపండు సునీత, హెడ్ కుక్ పద్మలపై శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి కస్తూరి శంకర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగాల హన్మండ్లు తెలిపారు.

ఒకరిపై ..

నేరడిగొండ: మండలంలోని గుత్పాల గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన దేవరకొండ అనిల్ అనే యువకుడు శుక్రవారం రాత్రి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహిళ వారి బంధువుల ఇంటి వద్ద ఉండగా ఆయన రాత్రి ఇంట్లోకి చొరబడి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

బైక్ చోరీ

కైలాస్‌నగర్: పట్టణంలోని టూటౌన్ పరిధిలో బైక్ చోరీ సంఘటన చోటు చేసుకుంది. సీఐ అశోక్ కథనం ప్రకారం మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన దారుట్ల పొచ్చన్న పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలోని సాయిబాబా మోటర్ షాపు వద్ద శుక్రవారం రాత్రి 10 గంటలకు బైక్‌ను పార్కింగ్ చేశాడు. కొంత సమయం తర్వాత వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు తెలుసుకుని, టుటౌన్ ఫిర్యాదు చేశాడు. కేసు న మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల భీముడు


అధిక బరువుతో జన్మించిన బాల భీమునితో తల్లి

నిర్మల్‌చైన్‌గేట్: సాధారణంగా శిశువులు 2.5 కిలోల నుంచి 3.5 కిలోల బరువుతో జన్మిస్తారు. నిర్మల్‌లో 4.900 కిలోల బరువుతో శనివారం బాబు జన్మించాడు. సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన స్రవంతి శుక్రవారం ప్రసవం కోసం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. హెచ్‌వోడీ డాక్టర్ సరోజ ఆధ్వర్యంలో డ్యూటీ డాక్టర్, నర్సులు సాధారణ స్రవంతికి సాధారణ ప్రసవం చేశారు. ప్రస్తుతము తల్లి, బాబు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వైద్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కుంటాల: మండలంలోని అర్లి(కే) 61వ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సుద్దవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై వి.రజినీకాంత్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉపకారవేతనం

- 39 మంది విద్యార్థుల ఎంపిక
- విద్యార్థులను అభినందించిన వీసీ


విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అభినందించారు. శనివారం ట్రిపుల్‌ఐటీలో పలు సంస్థలు విద్యార్థులను ఎంపిక చేసి ఉపకారవేతనాలు ఇచ్చేందుకు అంగీకరించాయి. యూనైటేడ్ వే ఆఫ్ హైదరాబాద్, బిటియాన్ ఫెలో షిప్, సీమాన్ స్కాలర్‌షిప్ కింద 39మంది విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ సహకారంతో ఎంపిక ప్రక్రియను పూర్తిచేశారు. 2023–24 విద్యాసంవత్సరానికిగాను 39 మంది విద్యార్థులకు ప్రతియేట రూ. 40వేల చొప్పున ఫేలోషిప్ అందనుంది. ఎంపికైన విద్యార్థులను ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు అభినందించారు.

రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొర్రన్న


వివరాలు తెలుసుకుంటున్న సంగెపు బొర్రన్న

తాంసి: వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల దిగుబడి రాక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు, రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పాలోది గ్రామానికి చెందిన రాయల పోశెట్టి రైతు గత నెల 5వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆత్మహత్యకు గల కారణాలతో పాటు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట దిగుబడి, అప్పుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట దిగుబడులు సరిగ్గా రాక రైతులు నష్టపోతున్నారని అన్నారు. అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రైతు బీమాతో పాటు 194 జీఓ ప్రకారం రూ.6లక్షలు పరిహారం అందించాలన్నారు. ప్రతి నెల కుటుంబానికి రూ.5వేల పింఛన్ సైతం మంజూర్ జేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ శంకర్, రైతులు సతీష్ రెడ్డి, ఆశన్న, నాగారెడ్డి ఉన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామానికి చెందిన నక్కువాడ్ మాధవ్‌రావు(55) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం మాధవ్‌రావు గత కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబీకులతో తరచూ గొడవపడేవాడు. శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్యతోపాటు నలుగురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి..

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన కుంసర సాయినాథ్(48) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నారాయణ్‌సింగ్ కథనం ప్రకారం.. సాయినాథ్ కొంతకాలంగా మద్యానికి బానిసగా మారి ఖాళీగా ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి తన గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. కొద్దిసేపటికి భార్య భోజనం కోసం పిలిచేందుకు వెళ్లగా ఎంతకీ తలుపు తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపు తీసి లోనికి వెళ్లగా ఉరేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన అంకత్ మల్లేష్ (50) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మల్లేష్ గత కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య చికిత్సలు చేయించుకున్న నయాం కాలేదు. దీంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి 2 గంటల సమయంలో బహిర్భూమికి వెళ్తానని చెప్పి పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చి ముంగిట్లో కేకలు వేసి పడి ఉన్న ఆయనను గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిన్నట్లు నిర్ధారించారు. మృత్యుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లి కావటం లేదని..


బోథ్ (నేరడిగొండ): బోథ్ పట్టణంలోని న్యూకాలనీకి చెందిన జాదవ్ జ్ఞానేశ్వర్ (21) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాము వివరాల ప్రకారం.. కొంతకాలంగా పెళ్లి చేసుకోవాలని పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. ఉగాది పండుగ తర్వాత చేస్తామని చెప్పినా వినిపించుకోలేదు. పెళ్లి కావడం లేదని మనస్తాపంతో శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి జాదవ్ సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

బోథ్(నేరడిగొండ): మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న భూమయ్య అనే వ్యక్తిని బోథ్ ఎస్సై రాము పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దుకాణంపై దాడి చేయగా 2.880 లీటర్ల అక్రమ మద్యం పట్టుబడింది. దీంతో బాధితుడిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గోల్డ్ 'ట్రిపుల్' రన్..!

- శనివారం ఒక్కరోజే మూడుసార్లు హెచ్చు
- మూడురోజుల్లో రూ.3వేలు పెరిగిన బంగారం ధర
- ఆందోళన చెందుతున్న కొనుగోలుదారులు



భైంసాటౌన్: పసిడి ధర ఆల్ టైం రికార్డు నమోదు చేస్తోంది. రోజురోజుకూ ధర పెరుగుతూ కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తోంది. అసలే పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతో పెరుగుతున్న ధరలతో బెంబేలెత్తుతున్నారు. మూడురోజుల కిందట పది గ్రాములకు రూ.70వేలు ఉండగా, మూడురోజుల వ్యవధిలోనే రూ.3వేలకుపైగా పెరిగింది. దీంతో శుభకార్యాలు పెట్టుకున్నవారు పెరిగిన బంగారం ధరలతో అదనంగా భారం మోయాల్సి వస్తోందని వాపోతున్నారు. మరోవైపు వ్యాపారులు సైతం అదే స్థాయిలో ఆందోళన చెందుతున్నారు. ఈరోజు ఉన్న ధర మధ్యాహ్నానికే మారుతుండడంతో కొనుగోలుదారులకు తక్కువ ధరకు ఆర్డర్ తీసుకుని నష్టపోతున్న సందర్భాలు ఉన్నాయి.

ఒక్కరోజులోనే మూడుసార్లు హెచ్చు...

మార్చి నెలాఖరు వరకు రూ.68వేలు ఉన్న బంగారం ధర ఈ నెల ప్రారంభంలో రూ.70వేలకు చేరి రికార్డు ధరను నమోదు చేసింది. ఆ తరువాత మరుసటి రోజు రూ.69వేలకు చేరుకున్న బంగారం ధర తరువాత రోజు రూ.72వేలకు చేరుకుంది. శనివారం ఉదయం 24క్యారెట్ల బంగారం ధర రూ.72,200 ఉండగా, మధ్యాహ్నం 2.30 గంటలకు రూ.600 పెరిగి రూ.72,800లకు చేరింది. మళ్లీ సాయంత్రం 4.30గంటలకు మరో రూ.600 పెరిగి రూ.73,200లకు చేరుకుంది. దీంతో ఒక్క రోజులోనే మూడుసార్లు ధర పెరిగి ట్రిపుల్ ధమాకా చూపించింది.

శనివారం బంగారం ధరలిలా...

ఉదయం	రూ.72,200
మధ్యాహ్నం 2.30గం.	రూ.72,800
సాయంత్రం 4.30గం.	రూ.73,200

బులియన్ మార్కెట్‌ను అనుసరించి...

చాలా అరుదుగా ఒకేరోజు బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు నమోదవుతుంటాయి. శనివారం ఒక్కరోజే రూ.వెయ్యి వరకు ధర పెరిగి పది గ్రాములు రూ.73,200లకు చేరింది. బులియన్ మార్కెట్ ఆధారంగా ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి.

– సాదుల నారాయణ, బంగారం, వెండి వర్తకులు, భైంసా